JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 03-06-2026
Medchal - Malkajgiri । Wednesday 03-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 02
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 02 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com



## తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దిన కేసీఆర్

- కాంగ్రెస్ పార్టీని ప్రజలు పండబెట్టి తొక్కే రోజులు దగ్గరలోనే..



జయభేరి, హైదరాబాద్ :

పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ అద్భుతమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. భారతదేశ చిత్రపటంలో తెలంగాణ రాష్ట్రాన్ని నిలిపిన కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని అంటున్న ముఖ్యమంత్రి ఏం చేస్తారో ప్రజలకు చెప్పాలి. మరి అద్భుతమైన సెక్రటేరియట్, అమరవీరుల స్థూపం, 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహం, కమాండ్ కంట్రోల్ ...మిగతాది 2 లో

## తెలంగాణ మీ అయ్య జాగీరా?



జయభేరి, విజయవాడ :

తెలంగాణ గురించి జనసేన ఎందుకు మాట్లాడుతుందని అడుగుతున్నారు. జనసేన పార్టీ పెట్టిందే హైదరాబాద్ నడిబొడ్డన.. ఇది తెలంగాణపై కొత్తగా తెచ్చుకున్న ప్రేమ కాదని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. నేను తెలంగాణ నలుమూలలా తిరిగాను. తెలంగాణ బాగుండాలని అనుకునేవాణ్ని.. ఇప్పుడు నన్ను విమర్శించేవారు ఆదిలాబాద్ లాంటి నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో తిరగలేదు. నేను తెలంగాణకు వ్యతిరేకం కాదు.. విభజన జరిగిన తీరుకు వ్యతిరేకమని అన్నారు. తెలంగాణ ప్రజలకు, నాయకులకు ఏపీ ప్రజలపై విద్వేషం లేదు. హైదరాబాద్లో ఎలా అడుగుపెడతారని కొందరు అడుగుతున్నారు. మీ అయ్య జాగీరా తెలంగాణ.. మీరెవరు నన్ను బెదిరించడానికి..? బెదిరించేవారికి ఒకటే చెబుతున్నా.. నా ఇంటి అడ్రస్ చెప్పడానికే ఇక్కడ ప్రెస్మీట్ పెట్టానని అన్నారు.

## ఏఐతో నటి పరువు తీసే యత్నం..

- 29 సోషల్ మీడియా ఖాతాలపై ఎఫ్ఐఆర్ నమోదు



జయభేరి, హైదరాబాద్, జూన్ 2 :

'కాంతార చాప్టర్ 2' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నటి రుక్మిణి వసంత్ నకిలీ వీడియోల వ్యవహారంలో బెంగళూరు సైబర్ క్రైమ్ పోలీసులు ...మిగతాది 2 లో




# నిరుద్యోగులకు అదరిపోయే ఆఫర్

- ఆవిర్భావ దినోత్సవ వేళ రేవంత్ ప్రకటన
- అర్హులైన పేదల సొంతిల్లు కల సాకారం
- రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే లక్ష్యం

జయభేరి, హైదరాబాద్, జూన్ 2 :

తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిషికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం...రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకలలో భాగంగా విధుల్లో ఉత్తమ సేవలు ...మిగతాది 2 లో



# ఒక్క రోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా

- ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, శానిటేషన్, తాగునీరు, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి
- గోదావరి పుష్కరాల పనులపై సీఎం సమీక్ష

జయభేరి, అమరావతి :

గోదావరి పుష్కరాలు 2027 నిర్వహణపై సచివాలయంలో వివిధ శాఖలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టుపై సమీక్షలో మంత్రుల కమిటీతో పాటు వివిధ శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశాలు ఇచ్చారు. 2027 గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును కూడా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సమీక్షలో వెల్లడించారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి చేసిన సూచనల్ని పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని అన్నారు. పుష్కరాల నిర్వహణతో పాటు రాజమహేంద్రవరం లాంటి నగరం ...మిగతాది 2 లో

## దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి

జయభేరి, కోల్ కత్తా, జూన్ 2 :

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కోల్‌కతాలో తాను చేపట్టబోయే ధర్నాను అడ్డుకోవాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ధైర్యముంటే నన్ను అరెస్ట్



చేసుకోండి అంటూ పోలీసులకు బహిరంగంగా సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల తదనంతర హింసకు వ్యతిరేకంగా, అలాగే తన మేనల్లుడు, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడిని నిరసిస్తూ మమతా బెనర్జీ ఒక భారీ నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చారు. అయితే ఈ ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో దీదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా మేము కచ్చితంగా ధర్నా నిర్వహించి తీరుతాం. మీ చేతనైతే నన్ను అరెస్ట్ చేసుకోండి అని సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో మమతా బెనర్జీ స్పష్టం చేశారు.బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితులు మరింత దిగజారాయని, ప్రజలు తీవ్ర భయాందోళనల మధ్య బతుకుతున్నారని ఆమె ఆరోపించారు. ...మిగతాది 2 లో

## మోదీ పసిడి మంత్రం

- పాత బంగారంతోనే కొత్త వెలుగులు!



జయభేరి, న్యూఢిల్లీ :

ఇండియాలో బంగారం అంటే కేవలం ఓ లోహం కాదు.. అది సంస్కృతి, సెంటిమెంట్, కుటుంబాల ఆర్థిక భద్రతతో ముడిపడి ఉన్న ఓ అమూల్యమైన ఆస్తి. అయితే ప్రస్తుతం దేశంలోని ఇళ్లు, ఆలయాల్లో సుమారు 32,000 టన్నుల బంగారం(దాదాపు 3.8 ట్రిలియన్ డాలర్ల విలువైనది) ఎటువంటి ఉపయోగం లేకుండా లాకర్లలో, బీరువాల్లో మూలన పడి ఉంది. ఈ నేపథ్యంలో కొత్త బంగారాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం కంటే దేశంలోనే నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని రీసైక్లింగ్ చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. బంగారం రీసైక్లింగ్ అంటే పాత లేదా విరిగిపోయిన ఆభరణాలు, నాణేలు, పారిశ్రామిక వ్యర్థాల నుంచి బంగారాన్ని సేకరించి దానిని ...మిగతాది 2 లో

## జూన్ 2 మరిచిపోలేని రోజు

- విద్రోహ, వ్యతిరేక శక్తుల నుండి మన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఈ ఆవిర్భావ దినోత్సవం సాక్షిగా మనమంతా మళ్లీ ఒకసారి ప్రతిజ్ఞ చేద్దామని కేటీఆర్ పిలుపు



జయభేరి, హైదరాబాద్, జూన్ 2 :

తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. దశాబ్దాల తరబడి సాగిన వివక్ష, అవమానాలు, అణచివేతకు ముగింపు పలికిన జూన్ 2వ తేదీ తెలంగాణ చరిత్రలోనే అత్యంత అద్భుతమైన రోజని ఆయన అభివర్ణించారు. అమరవీరుల త్యాగాలు, ఉమ్మడి ఆత్మగౌరవ పోరాటం వల్లే తెలంగాణ ప్రజలు విముక్తి సాధించారని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఉద్యమ కాలంలో వినిపించిన "తెలంగాణ వచ్చుడా... కేసీఆర్ సచ్చుడా" అనే నినాదాన్ని ప్రస్తావిస్తూ.. 60 ఏళ్ల సుదీర్ఘ కలని నిజం చేయడంలో తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర రావు ...మిగతాది 2 లో

## వెలవెలబోతున్న తెలంగాణ తల్లి విగ్రహం

- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైనా పట్టించుకోని అధికారులు,నాయకులు, ఉద్యమకారులం అని చెప్పుకునే వాళ్ళు
- కనీసం రంగులు వేయక శిథిలావస్థ
- అవసరమైనప్పుడు మాత్రమే విగ్రహానికి నివాళులకు, ధర్నాలకు వాడుకుంటున్న పార్టీలు
- యాదగిరిగుట్ట బస్టాండ్ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహం దుస్థితి.


2 లో

జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 02 :

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం,అధికార పార్టీ నేతలు, అధికారులు తెలంగాణ తల్లి విగ్రహాన్ని పట్టించుకోకపోవడంతో వెలవెలబోతోంది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## మోదీ పసిడి మంత్రం

కరిగించి శుద్ధి చేయడం ద్వారా మళ్లీ 99.9 శాతం స్వచ్ఛమైన 24క్యారెట్ బంగారంగా మార్చాడం. ముత్తూట్ ఎగ్జిమ్ సీఈవో కేయూర్ షా వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ప్రక్రియ వల్ల పర్యావరణానికి కూడా ఎంతో మేలు జరుగుతునంది. కొత్త బంగారాన్ని మైనింగ్ చేయడం వల్ల పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఎక్కువ ఇంధనం ఖర్చవుతుంది. అదే రీసైక్లింగ్ ద్వారా అయితే సహజ వనరులను కాపాడుకుంటూనే అవసరాలను తీర్చుకోవచ్చు. ప్రభుత్వం ఈ రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడానికి ప్రధాన కారణం దేశంపై పడుతున్న భారీ ఆర్థిక భారమే. 202526 ఆర్థిక సంవత్సరంలో ఇండియా తన బంగారపు అవసరాల కోసం ఏకంగా 72.4 బిలియన్ డాలర్లను ఖర్చు చేసి విదేశాల నుంచి బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఈ దిగుమతుల వల్ల దేశ విదేశీ మారక నిల్వలు తగ్గిపోవడమే కాకుండా కరెంట్ అకౌంట్ లోటు కూడా పెరుగుతుంది. మనం రీసైక్లింగ్ చేసే ప్రతి గ్రాము బంగారం, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే భారాన్ని అంత మేర తగ్గిస్తుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. దేశంలో ఉన్న మొత్తం బంగారంలో కేవలం ఒక్క శాతం బంగారాన్ని ప్రతి ఏటా రీసైక్లింగ్ చేసినా.. ఇండియా బంగారపు దిగుమతులు దాదాపు 25 నుంచి 33 శాతం వరకు తగ్గిపోతాయి. ఇది దేశ ఆర్థిక స్థిరత్వానికి ఎంతగానో దోహదపడుతుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'గోల్డ్ మోనిటైజేషన్ స్కీమ్', ప్రధాని మోదీ చేసిన విజ్ఞప్తి ద్వారా లాకర్లలో నిద్రపోతున్న ఈ సంపదను బయటకు తీసి, దేశీయంగా ఒక బలమైన సప్లై చైన్‌ను నిర్మించాలని విధానకర్తలు భావిస్తున్నారు. సాధారణంగా భారతీయులు బంగారాన్ని ఓ సురక్షితమైన పెట్టుబడిగా, ద్రవ్యోల్బణం నుంచి రక్షణగా భావిస్తారు. అందుకే తరాల తరబడిగా వివాహాలు, పండుగల ద్వారా వచ్చిన పాత ఆభరణాలను అలాగే దాచి ఉంచుతారు. అయితే మారుతున్న కాలంతో పాటు ప్రజల ఆలోచనల్లో కూడా మార్పు వస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరడం, జ్యువెలరీ సంస్థలు ఎటువంటి తరుగు లేకుండా పాత బంగారానికి బదులుగా కొత్త డిజైన్లను ఆఫర్ చేస్తుండటంతో, ప్రజలు పాత బంగారాన్ని రీసైక్లింగ్ చేయడానికి, ఎక్స్ఛేంజ్ చేసుకోవడానికి మక్కువ చూపుతున్నారు.

## జూన్ 2 మరిచిపోలేని రోజు

పోషించిన కీలక పాత్రను కేటీఆర్ కొనియాడారు. 14 ఏళ్ల పాటు సాగిన సుదీర్ఘ స్వరాష్ట్ర ఉద్యమంలో కానీ, ఆ తర్వాత తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కానీ, కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎల్లప్పుడూ తెలంగాణ ప్రగతి, ప్రజల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా పనిచేసిందని స్పష్టం చేశారు. నేటికీ తమ పార్టీ ప్రజల గొంతుకగా నిలుస్తూ... తెలంగాణ అస్తిత్వానికి, ప్రగతికి ఒక రక్షణ కవచంలా నిలబడిందని పేర్కొన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ పాలన సాగుతున్న తరుణంలో ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు ఒక ప్రత్యక్ష పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల సేవ కోసం ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త పునరంకితం కావాలని కోరారు. తెలంగాణను దెబ్బతీయాలని చూస్తున్న విద్రోహ, వ్యతిరేక శక్తుల నుండి మన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఈ ఆవిర్భావ దినోత్సవం సాక్షిగా మనమంతా మళ్లీ ఒకసారి ప్రతిజ్ఞ చేద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఈ సందర్భంగా ఆయన ఘన నివాళులర్పించారు.

## వెలవెలబోతున్న తెలంగాణ తల్లి విగ్రహం

యాదగిరిగుట్ట పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా పండుగ వాతావరణం ఉన్నా తెలంగాణ తల్లి విగ్రహం మాత్రం కళతప్పి వెక్కిరిస్తోంది. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న రాష్ట్రంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పట్టిచుకునే నాథుడే కరువయ్యాడని,రాష్ట్ర ప్రభుత్వం,అధికార యంత్రాంగమంతా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తూతూ మంత్రపు చర్యలతో పండుగను జరుపుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు, ఉద్యమ కారులం అని చెప్పుకునే వారు తమతమ కార్యాలయాల్లో జెండాలు ఎగరవేయడానికే సరిపోతున్నారే తప్పా ఎవరికీ తెలంగాణ తల్లిని సరైన రీతిలో పట్టింపులేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా వివిధ రాజకీయ పార్టీల నేతలు సైతం తెలంగాణ తల్లి విగ్రహాన్ని నివాళులర్పించడాని, ధర్నాలు సెంటిమెట్ల కొరకు వాడుకుంటున్నారే తప్పా కనీసం రంగులు వేయాలన్న ఆలోచన సైతం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి తెలంగాణ తల్లి విగ్రహానికి మరమ్మతులు చేసి రంగులు వేయాలని, రాజకీయ పార్టీలు సైతం నివాళులకే పరిమితం కాకుండా విగ్రహాన్ని పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఒక్కరోజులో 1 కోటి మంది ..

ఓ మెగాసిటీగా అభివృద్ధి అయ్యేలా పనులు చేపట్టాలని సూచనలు ఇచ్చారు. కేవలం పుష్కరాలకు మాత్రమే పనులు పరిమితం చేయకుండా ప్రస్తుతం కల్పిస్తోన్న మౌలిక వసతులు గోదావరి పరివాహక ప్రాంతానికి ఆస్తిగా మారాలని అన్నారు. పోలవరం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పుష్కరాల పనులు, రాష్ట్రంలో 212 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తోన్న గోదావరి నది. పోలవరం జిల్లా గుండాలలో మొదటి పుష్కర ఘాట్, కోనసీమ జిల్లా అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలోని గోవాలంక,పశ్చిమ గోదావరిలోని నర్సాపురంలో చివరి ఘాట్ నిర్మాణ ప్రతిపాదనలను ఆయన సమీక్షించారు. ప్రస్తుతం ఉన్న 288 ఘాట్లతో సహా కొత్తగా 237 ఘాట్లను నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసారు. ఈసారి పుష్కరాల్లో పుణ్య స్నానాల కోసం 9 నుంచి 10 కోట్లమంది భక్తులు వస్తారని అంచనా. పుష్కర ఘాట్లు, రహదారులు, టెంట్లు, మరుగుదొడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం పనులు చేపట్టేలా ప్రతిపాదనలు రూపొందించారు. రాజమహేంద్రవరం, నర్సాపురం సహా వివిధ పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ పరిధిలో రూ.1,974 కోట్ల వ్యయంతో 1,660 పనులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో రూ.1,080 కోట్ల విలువైన 1140 పనులు జరుగుతున్నాయి. ఈసారి ఒక్కరోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా. ప్రస్తుతం 4.5 కిలోమీటర్ల మేర పొడవైన పుష్కర ఘాట్లు. కొత్తగా నిర్మించే వాటితో కలిపి ఘాట్ల పొడవు 9.9 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. అత్యధికంగా తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో 150కి పైగా పుష్కర ఘాట్ ల నిర్మాణం జరగనున్నది. ఇప్పటికే రూ.211.97 కోట్లకు సంబంధించి 132 పనులకు అనుమతులు మంజూరు చేసారు. ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, శానిటేషన్, తాగునీరు, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు సూచింఆరు. ఈ సమీక్షకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, పి.నారాయణ, అనిత, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ జి.సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, దేవాదాయ, వైద్యారోగ్యం, రవాణా, పర్యాటక, పురపాలక, పంచాయితీరాజ్, ఆర్థిక, జలవనరులు, పోలీసు శాఖల ఉన్నతాధికారులు హజరయ్యారు.

## దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి

పోలీసులు కావాలనే తమ టీఎంసీ పార్టీని బలహీనపరిచేందుకు, దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవలి ఎన్నికల తర్వాత తమ పార్టీకి చెందిన దాదాపు 12 మంది కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని, వేలాది మందిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆమె ఈ సందర్భంగా వెల్లడించారు. కొంతమంది నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడినా.. అది టీఎంసీని మరింత బలంగా పునర్నిర్మించడానికే ఉపయోగపడుతుందని వ్యాఖ్యానించారు. కోల్‌కతాలో శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తే.. ఈ పోరాటాన్ని దేశ రాజధాని ఢిల్లీకి సైతం తీసుకెళ్లడానికి తాను సిద్ధంగా ఉన్నానని మమతా బెనర్జీ హెచ్చరించారు.

# భారీగా తగ్గిన బంగారం కొనుగోళ్లు..



ప్రధాని నరేంద్ర మోదీ కొద్ది రోజుల కిందట విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు కీలక సూచనలు చేసిన సంగతి తెలిసిందే. ఇందులోనే బంగారం కొనుగోళ్లకు సంబంధించింది ఒకటి ఉంది. భారతీయులు బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు నిలిపివేయాలని..పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉన్నా కొనబోమని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. అయితే ఈ క్రమంలోనే పసిడి కొనుగోలుదారులు ట్రెండ్ మార్చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒక్క నిర్ణయం దేశంలో పసిడి అమ్మకాలను భారీగా తగ్గించేసింది. దిగుమతి సుంకాన్ని భారీగా పెంచడంతో విక్రయాలు పడిపోయాయి. ఇరాన్ ఉద్రిక్తతలతో పెరిగిన ఇంధన, ఆహార ధరలు తోడవడంతో జనం అసలు షాపుల వైపు వెళ్లడమే మానేశారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా పసిడి డిమాండ్ ఊహించని విధంగా 70 శాతం మేర పడిపోయింది.బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం 6 శాతం నుంచి ఏకంగా 15 శాతానికి పెంచింది. దీనికి జీఎస్టీ కూడా చేరడంతో పసిడిపై పడే మొత్తం పన్ను భారం 9.18 శాతం నుంచి 18.45 శాతానికి చేరింది. రూపాయి విలువ పతనం కావడం, క్రూడాయిల్ ధరలు పెరగడంతో విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.పన్నుల పెంపు దెబ్బకు దేశవ్యాప్తంగా పసిడి కొనుగోళ్లు భారీగా పడిపోయాయని 'ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్' వెల్లడించింది. గతేడాది మే నెల చివరి రెండు వారాల్లో 25 టన్నులుగా ఉన్న బంగారం డిమాండ్ ఈసారి కేవలం 7.5 టన్నులకే పరిమితమైంది. దేశీయ బంగారం వ్యాపారంలో 65 శాతం వాటా ఉన్న అసంఘటిత రంగం ఈ నిర్ణయంతో తీవ్రంగా ప్రభావితమైంది .ఈ ఏడాది బంగారానికి దూరంగా ఉండాలంటూ ప్రధానమంత్రి మోదీ దేశ ప్రజలకు చేసిన విజ్ఞప్తి కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనితో పాటు పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలు పసిడి కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నాయి. ప్రస్తుతం ముంబై స్పాట్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.1.57 లక్షలు పలుకుతుండటం గమనార్హం.బంగారం ధరలు ఆకాశాన్ని తాకడంతో కొనుగోలుదారులు తమ బడ్జెట్‌కు తగ్గట్టుగా తక్కువ క్యారెట్ ఉన్న లైట్ వెయిట్ నగల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉండటాన్ని ఆసరాగా చేసుకొని చేతిలో డబ్బుల కోసం తమ పాత నగలను అమ్మి క్యాష్ చేసుకునేందుకు జనం జువెలరీ షాపుల వద్ద క్యూ కడుతున్నారు.భారతీయులకు బంగారం అంటే విపరీతమైన ఇష్టం ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఎక్కువగా మహిళలు.. పండగలు, పెళ్లిళ్లు సహా ఇతర శుభకార్యాల వేళ బంగారు ఆభరణాల్ని ఎక్కువగా కొనుగోలు చేసి ధరించాలని చూస్తుంటారు. అయితే..గత కొంత కాలంగా దీనికి డిమాండ్ తగ్గింది. బంగారం ధరలు ఈ కాలంలో విపరీతంగా పెరగడమే ఇందుకు కారణం. గతేడాది గోల్డ్ రేట్లు ఏకంగా 70 శాతానికిపైగా పెరిగాయి.





ఇదే సమయంలో ఈ ఏడాది కూడా ఆరంభంలో పెరిగినా.. తర్వాత అమెరికా ఇరాన్ యుద్ధం నేపథ్యంలో స్వల్పంగా తగ్గాయి. అయినప్పటికీ మరీ ఎక్కువేం తగ్గలేదు. దీంతో ఇప్పటికీ గరిష్ఠ స్థాయిల్లోనే కొనసాగుతున్నాయి.ఇక భారత ప్రధాని నరేంద్ర మోదీ కొద్ది రోజుల కిందట బంగారం కొనుగోళ్లకు సంబంధించి ఒక కీలక ప్రకటన చేశారు. విదేశీ మారక ద్రవ్యం తరిగిపోతుందని.. దీనిని ఆదా చేసేందుకు బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు నిలిపివేయాలని.. పండగలు, ఇతర శుభకార్యాలు ఉన్నా కూడా పసిడి కొనుగోళ్లను వాయిదా వేయాలని సూచించారు. భారతీయులు.. బంగారానికి సంబంధించి ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతుంది కాబట్టి.. దిగుమతి బిల్లు పెరిగి విదేశీ మారక ద్రవ్యం తరిగిపోతుందని అన్నారు. అయితే మరి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు తర్వాత భారతీయులు.. బంగారం కొనుగోళ్లను తగ్గించారా అంటే.. అలా జరగకున్నా ట్రెండ్ మార్చేశారని తెలుస్తోంది. పసిడి కొనుగోళ్లకు సంబంధించి.. వినియోగదారుల ధోరణిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని తెలుస్తోంది. గతంలో కొత్త ఆభరణాల్ని కొనుగోలు చేసేందుకు పూర్తి మొత్తం డబ్బులు చెల్లించేవారు.. కానీ ఇప్పుడు మాత్రం తమ దగ్గర ఉన్నటువంటి పాత బంగారు ఆభరణాల్ని ఇచ్చి వాటి విలువకు కొంత అదనపు మొత్తం జోడించి.. కొత్త డిజైన్లు ఎంపిక చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది.వాస్తవంగా చెప్పాలంటే.. పాత బంగారం ఇచ్చి కొత్త బంగారం తీసుకోవడం అనేది కొత్త విషయం ఏమీ కాకపోయినా.. గతంలో దీనిపై ఎక్కువగా ఆసక్తి చూపించేవారు కాదు. అప్పట్లో బంగారం స్వచ్ఛతను సరిగా అంచనా వేస్తారా? వేయరా? వేరే దుకాణాల్లో కొనుగోలు చేసిన ఆభరణాలకు సరైన ధర ఇస్తారా లేదా? అదనంగా ఛార్జీలు ఏమైనా విధిస్తారా.. ఇలాంటి సందేహాలతో చాలా మంది దీనికి దూరంగా ఉండేవారు. అయితే ఇప్పుడు హాల్ మార్కింగ్ వ్యవస్థ పకడ్బందీగా అమలు చేస్తుండటం, ఆధునిక టెస్టింగ్ పద్ధతులు అందుబాటులోకి రావడంతో చాలా మందిలో ఒకప్పటి భయాలు తగ్గుతున్నాయి.నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రస్తుతం బంగారం ధరలు అధిక స్థాయిల్లో ఉన్న నేపథ్యంలో పాత బంగారు ఆభరణాల్ని మార్పిడి చేసుకోవడం అనేది ఆర్థికంగా ప్రయోజనకర నిర్ణయం అని చెబుతున్నారు. ఇది వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా.. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. భారత్ ఏటా భారీ మొత్తంలో బంగారం దిగుమతి చేసుకుంటుంది కాబట్టి.. పాత ఆభరణాల్ని రీసైక్లింగ్ చేయడం.. మార్పిడి చేసుకోవడం పెరిగితే అప్పుడు కొత్త బంగారం దిగుమతుల అవసరం కూడా కొంత మేర తగ్గుతుంది. దీంతో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి కూడా తగ్గుతుంది.

---

## తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దిన కేసీఆర్

సెంటర్ లను తొలగిస్తారా? లేకుంటే యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా రాష్ట్రాన్ని మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టును కూలుస్తారా? తెలంగాణ చరిత్ర ఉన్నంత వరకు కేసీఆర్ ఆనవాళ్ళు ఉంటాయి. కాయకష్టం చేసి రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయలేని, కనీసం గోనె సంచులు కూడా అందించలేని స్థితిలో అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు పండబెట్టి తొక్కే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు.

## ఏఐతో నటి పరువు తీసే యత్నం

కఠిన చర్యలు చేపట్టారు. ఆమె ఫేక్ బికినీ వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్న 29 ఖాతాలపై నేడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ మేరకు నటి రుక్మిణి వసంత్ ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డీప్‌ఫేక్ టెక్నాలజీని ఉపయోగించి వేరొకరి శరీరానికి తన ముఖాన్ని అతికించి, ఫేక్ విజువల్స్ సృష్టించారని రుక్మిణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్య తనను తీవ్ర ఇబ్బందికి గురిచేసిందని, ఉద్దేశపూర్వకంగా తన క్యారెక్టర్, ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకే ఇలా చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారునటి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు, 9 ఇన్‌స్టాగ్రామ్, 14 'ఎక్స్', 6 ఫేస్‌బుక్ పేజీలతో సహా మొత్తం 29 ఖాతాలను గుర్తించి కేసు నమోదు చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టంలోని సెక్షన్లు 66సి, 66డితో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద విచారణ ప్రారంభించారు. ఈ ఘటనపై గతంలోనే రుక్మిణి స్పందించారు. ఆన్లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న చిత్రాలు పూర్తిగా ఫేక్ అని, వాటిని ఏఐ టెక్నాలజీతో సృష్టించారని తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో స్పష్టం చేశారు. "ఇలాంటి కంటెంట్‌ను సృష్టించడం, వ్యాప్తి చేయడం బాధ్యతారాహిత్యం. ఇది వ్యక్తిగత గోప్యతకు తీవ్ర భంగం కలిగించడమే" అని ఆమె పేర్కొన్నారు. టెక్నాలజీని మంచి పనులకు వాడాలని, ఇలాంటి హానికరమైన కార్యకలాపాలకు కాదని ఆమె హితవు పలికారు. ఇలాంటి కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయవద్దని కూడా విజ్ఞప్తి చేశారు. రుక్మిణి వసంత్.. 2007లో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడి ప్రాణత్యాగం చేసిన అశోక చక్ర గ్రహీత, దివంగత కల్నల్ వసంత్ వేణుగోపాల్ కుమార్తె. ఆయన స్ఫూర్తిగానే 'యూరి' అనే బాలీవుడ్ చిత్రం కూడా వచ్చింది. రుక్మిణి తల్లి సుభాషిణి వసంత్ ప్రముఖ భరతనాట్య కళాకారిణి.

## నిరుద్యోగులకు అదరిపోయే ఆఫర్

అందించిన పలువురు పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రపంచానికే తెలంగాణను గేట్‌వేగా నిలబెట్టాలన్నది తన కల అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దానికి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంటే మార్గమని తెలిపారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా నిలబెట్టాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. దీనికి ప్రజల అండదండలు, సహకారం కావాలని కోరారు. ప్రజల ఆశీర్వాదంతో ఈ లక్ష్యాన్ని చేరుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి ప్రతిఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల్లో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు ఆయన, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం సీఎం జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. రెండున్నరేళ్లలో అన్ని ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌పై అభిమానం చూపారని సీఎం రేవంత్ తెలిపారు. ఈ ఆదరణ తమ ప్రభుత్వంపై మరింత బాధ్యతను మోపిందన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని తరహాలో తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాచరిక ఆలోచనలను ఓడించి ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించారని వ్యాఖ్యానించారు. 30 నెలల్లో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించామని పేర్కొన్నారు. 2047 విధాన పత్రంలో రైతులకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో 2.36 కోట్ల టన్నుల పంట దిగుబడులు రావడం గర్వకారణమన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతుల నుంచి చివరి గింజ వరకూ కొంటామని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో జొన్న, మొక్కజొన్న సాగు గణనీయంగా పెరిగినట్లు వెల్లడించారు. తెలంగాణ హక్కుల సాధన కోసం అన్ని వేదికల్లో పోరాడుతున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్ట్‌కు తిరిగి ప్రాణం పోస్తున్నామని పేర్కొన్నారు. తుమ్మిడిహట్టి నిర్మాణం కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. మరోవైపు తెలంగాణ మహిళలు దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఆడబిడ్డలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు రూ.లక్ష కోట్ల రుణాలిస్తామని తెలిపారు. ఇప్పటికే రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందజేశామన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలు రూ.10 వేల కోట్ల విలువైన ప్రయాణాలు సాగించారన్నారు. తెలంగాణ సాధన కోసం నిరుద్యోగ యువత పోరాటం చేసిందని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. ఉద్యోగ నియామక ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నట్లు తెలిపారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మరోవైపు పేదల జీవన స్థితిగతులు ఎలా ఉంటాయో తనకు తెలుసని తెలిపారు. అందుకే ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.20,400 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 4.5 లక్షల ఇళ్లు నిర్మించాలన్నది ప్రభుత్వం లక్ష్యమని వెల్లడించారు. ఈ ఏడాది మూడున్న లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

**కాళోజీ మాటల స్ఫూర్తితో ముందుకెళ్తున్న తెలంగాణ**

"పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అన్నారు. గత 30 నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని..రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు.ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్‌ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు.

**అర్హులైన పేదల సొంతిల్లు కల సాకారం**

పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత 13 నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు.

# అమరవీరుల ఆశయాల కనుగుణంగా కృషి

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 02 :



తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమ వీరుల త్యాగాలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. మంగళవారం రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్టలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయం,కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని, రాష్ట్ర అవతరణ దినోత్సవం ప్రతి తెలంగాణ పౌరుడికి గర్వకారణమన్నారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, పేద ప్రజల అభ్యున్నతి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని,ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు,రాజకీయ పార్టీల నేతలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకలు..**

యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. యాదగిరిగుట్ట పట్టణంలోని తహశీల్దార్,ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, మున్సిపల్, గ్రంథాలయం,పీఏసీఎస్, వ్యవసాయ శాఖ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాలతో పాటు అన్ని గ్రామపంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు వివిధ ప్రాంతాల్లో జాతీయ జెండాను ఎగురవేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు.

**యాదగిరిగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో..**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఈవో భవానీ శంకర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఎస్పీఎఫ్ సిబ్బంది ఏర్పాటు చేసిన పరేడ్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట ఆలయ ఈవో మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావం అనేది అనేకమంది మహనీయుల త్యాగాలు,ఉద్యమ స్ఫూర్తి ఫలితమని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సాంస్కృతిక వైభవం మరింత పెరుగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ గా భాధ్యతలు స్వికరించిన బర్ల శ్రీనివాస్ యాదవ్

జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 2 :

యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ గా బర్ల శ్రీనివాస్ యాదవ్ ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపల్ నూతన కమిషనర్ గా బర్ల శ్రీనివాస్ యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన లింగస్వామి హైదరాబాద్ కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బర్ల శ్రీనివాస్ యాదవ్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించిన బర్ల శ్రీనివాస్ కు అధికారులు,సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్యం,తాగునీటి సరఫరా,మౌలిక వసతుల కల్పన,ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ నూతన కమిషనర్ బర్ల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

## శబరిమళ అయ్యప్ప సేవా సమాజం యాదాద్రి భువనగిరి జిల్లా సమావేశం

జయభేరి, యాదాద్రి :

తేది. 05.06.2026 మధ్యాన్నం 1.00 గంటలకు శ్రీ సురేంద్రపురి ఆర్యావైశ్య అన్న సత్రం మీటింగ్ హాల్ లో.... యాదాద్రి భువనగిరి జిల్లా శబరిమళ అయ్యప్ప సేవాసమాజం ముఖ్య కార్యనిర్వాహకులు పెండెం శ్రీనివాస్ గురుస్వామి సమావేశం నిర్వహించడం జరుగుతుంది. ఈ సమావేశంకు ముఖ్య అతిధిగా నాయిని బుచ్చిరెడ్డి SASS నేషనల్ జనరల్ సెక్రటరీ, ఆత్మీయ అతిదులుగా అయిత రాములు SASS రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, మంచుకంటి ధనుంజయ SASS రాష్ట్ర అధ్యక్షులు, తలారి వినోద్ కుమార్ SASS రాష్ట్ర జనరల్ సెక్రటరీ, DK లలిత్ కుమార్ SASS రాష్ట్ర కోశాధికారి, AB చంద్రశేఖర్ SASS రాష్ట్ర ఆర్గానైజింగ్ సెక్రటరీ, పాల్గొంటారు. ఈ సంవత్సరం SASS ఆధ్వర్యంలో నిర్వహించబోయే మహత్తర కార్యక్రమాల కార్యాచరణను ఈ సమావేశంలో దశ దిశ నిర్దేశించడం జరుగుతుంది. కావున ముఖ్య కార్యనిర్వాహకులు సమావేశంలో పాల్గొనాలని కోరుతున్నాను.

## తక్కువ వోల్టేజ్ విద్యుత్ సమస్య పరిష్కారం

జయభేరి, దేవరకొండ :

5 వ వాడు బంజారా కాలనీలో నెలకొన్న తక్కువ వోల్టేజ్ విద్యుత్ సమస్యను విద్యుత్ శాఖ ఏఈ తో పాటు ఎలక్ట్రికల్ సిబ్బందిని సంఘటనా స్థలానికి తీసుకెళ్లి పరిశీలించి పరిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి శ్రీకన్య సేవ్య నాయక్ , విద్యుత్ శాఖ ఏఈ , ఎలక్ట్రికల్ సిబ్బంది, స్థానిక యువకులు కాలనీ ప్రజలు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కౌన్సిలర్ తెలియజేసినారు.

# ఆంజనేయుడికి ప్రత్యేక అభిషేకాలు

జయభేరి, యాదగిరిగుట్ట :



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో కొలువైన శ్రీఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. మంగళవారం ఆంజనేయుడిని సింధూరంతో అలంకరించి స్వామివారికి వివిధ రకాల సుగంధం వెదజల్లే ద్రవ్యాల పూలమాలలతో అలంకరించి నాగవల్లి దలార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయుడిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

**నిత్యపూజలు..**

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం,వెండి జోడి సేవ,స్వర్ణ పుష్పార్చన,శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా మంగళవారం రూ.40,42,615 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,29,840, బ్రేక్ దర్శనం ద్వారా రూ.2,24,700, వీఐపీ దర్శనం ద్వారా రూ.4,57,050, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.4,17,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.59,400, ప్రసాద విక్రయం ద్వారా రూ.13,38,740, కల్యాణకట్ట ద్వారా రూ.80,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**యాదగిరీశుడి సేవలో ప్రముఖులు..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్‌కుమార్, ఎన్నికల కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్‌కుమార్ శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామి వారి లడ్డు ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

జయభేరి, దేవరకొండ :



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరకొండ పట్టణంలో జాతీయ పతాకాన్ని, పార్టీ జెండాను ఆవిష్కరించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్. సబ్బండ వర్గాలు ఏకమై గర్జించి, ఆత్మగౌరవం కోసం సాగిన పోరాట ఫలితం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరకొండ పట్టణంలో జాతీయ పతాకాన్ని, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......కేసీఆర్ ఉద్యమ నాయకత్వం, సబ్బండ వర్గాల పోరాటం కలిసి తెలంగాణ రాష్ట్రం పురుడు పోసుకున్నది అని ఆయన తెలిపారు.సాధించుకున్న రాష్ట్రాన్ని పదేళ్ల పాటు కంటికి రెప్పలా కాపాడుకున్నాం. సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో దేశానికే ఆదర్శంగా మారిందని ఆయన అన్నారు.అమరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుంటూ, తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలి ఆయన కోరారు.దేశందశాబ్దాల కాలపు కొట్లాటకు,నాలుగు కోట్ల ప్రజల తండ్లాటకు విముక్తి లభించిన రోజు నేడు అని అన్నారు.శాంతియుతంగా పార్లమెంటరీ పంథాలో కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించి, ఉమ్మడి రాష్ట్ర పాలనలో ఆగమైన తెలంగాణను స్వయం పాలనలో అభివృద్ధి చేసిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన అన్నారు.సకల జనుల సంక్షేమాన్ని కొనసాగిస్తూ, సమస్త రంగాల్లో ప్రగతిని సాధిస్తూ, పదేండ్ల అనతికాలంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా పాలన సాగించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన గుర్తు చేశారు.అన్ని వర్గాల ప్రజల జీవన విధానం మరింత గుణాత్మకంగా సాగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకొని అమలు చేయాలి అని ప్రభుత్వాన్ని కోరారు.ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల్లో విశ్వాసం నింపాలని అని ఆయన డిమాండ్ చేశారు.తెలంగాణ మరింత ప్రగతిని సాధిస్తూ, పాడి పంటలతో వర్ధిల్లుతూ, రైతులు సబ్బండ కులాలు, సకలజనుల జీవితాలు సుఖ సంతోషాలతో నిండాలీ అని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్ రావు,మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య,మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్ గౌడ్,మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్,మాజీ రైతు బంధు అధ్యక్షులు ఉజ్జిని విద్యాసాగర్ రావు,మాజీ PACS చైర్మన్ ముక్కమల్ల బాలయ్య, బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నీల రవికుమార్, మాధవ రావు,కౌన్సిలర్లు పొట్ట మధు,పొట్ట మురళి, మాజీ వైస్ ఎంపీపీ అరెకంటి రాములు, కార్మిక విభాగం నాయకులు మహమ్మద్ జనీబాబ,మాకం చంద్రమౌళి,మాల్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,తోటకూరి పరమేష్,పులిజాల జానీ, గిరామోని శ్రీను,sk.జమీర్ బాబా,రవీందర్ రావు,యాదగిరి రావు,వడత్య బాలు,మాడెం రాములు, వాజిద్ పాషా,గుండాల వెంకట్,నేనావత్ నాగార్జున, పగిడిమర్రి సతీష్,పగిడిమర్రి నాగరాజు, సూరి,సైదులు,సురేష్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

జయభేరి, తుర్కపల్లి, జూన్ 02 :

తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన తుడుం నరసయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కల్లూరి శ్రీనివాస్ రెడ్డి, కొడపాక పాపయ్య, వేముల లక్ష్మయ్య, వేముల మధు, పెద్దోళ్ల చంద్రమౌళి, మన్నె చంద్రయ్య, ఎర్ర కిష్టయ్య, అన్నంపట్ల కళాకారు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన తుర్కపల్లి విద్యార్థిని

- విద్యార్థిని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు



జయభేరి, తుర్కపల్లి, జూన్ 02 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తాటికొండ వైష్ణవి 2025 2026 విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో మండల టాపర్గా నిలిచి బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఐఐఐటి లో సీటు సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా పాలనాధికారిచే అందించబడిన శాలువాతో ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్, సర్పంచ్ సోమల వెంకటేశం, ఉపసర్పంచ్ పల్లె నరేష్‌గౌడ్ జ్ఞాపకతో పాటు ప్రశంసాపత్రంతో సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి బాసరలో సీటు సంపాదించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేస శ్రీనివాసాచారి, పెద్ది బిక్షమయ్య, పలుగుల సతీశ్ కుమార్, దూదిపాల జ్యోతి, ముసుకుల సుజాత, చింతలపూడి విశ్వేశ్వర రావు, శ్రీ రాంభట్ల మాధురి, బీరవెల్లి హరిత, బండి మధుకర్, రాజమైన అంబాజీ, అదరాసుపల్లి వెంకటలక్ష్మి, మల్లం చంద్రమౌళి, భూక్య గోవింద్, నారి అనూష, పెద్దాకుల బాస్కర్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసిల్దార్



జయభేరి, తుర్కపల్లి, జూన్ 02 :

తుర్కపల్లి మండల కేంద్రంతో పాటు దత్తాయి పెల్లి ఇబ్రహీంపూర్ గ్రామాల్లోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తాసిల్దార్ రవికుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరగా రవాణా చేస్తూ గోదాములకు తరలిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన ధాన్యాన్ని త్వరలో గోదాములకు తరలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిపిఓ పాహిం, రైతులు పాల్గొన్నారు.

## కొండ భీమన పల్లి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం





జయభేరి, దేవరకొండ :

పేద ప్రజల కంటి సమస్యలను తీర్చడం కోసం ఉచితంగా శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో ఎం.వి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండ భీమనపల్లి గ్రామంలో మంగళవారం శంకర్ నేత్రాలయం వారిచే ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. ఎం వి ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మునుకుంట్ల వెంకట్ రెడ్డి, మునుకుంట్ల తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ ఈ యొక్క శిబిరాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు కంటిచూపు సమస్యతో బాధపడుతున్న పేదల కోసం ఉచితంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేడు అధికారికంగా నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యులు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నారైలు తోపాటు మాజీ సర్పంచ్ మునికుంట్ల విద్యావతి వెంకటరెడ్డి, మునుకుంట్ల తిరుమల్ రెడ్డి, ఎం.వి.ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మునికుంట్ల వెంకటరెడ్డి,( ఎన్నారైలు ) భువనేష్ భుజాల, ఏ టి ఏ మాజీ అధ్యక్షుడు ప్రవీణ్ పాల్ రెడ్డి, వినయ్, గ్రామ సర్పంచ్ కొండ్రెడ్డి శ్రీను రామ్ రెడ్డి చంద్రం, చందా గాంధీ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

■ జెండా ఎగురవేసిన దుబాసి వెంకటస్వామి, కౌన్సిలర్

జయభేరి, పరకాల, జూన్ 02:

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఒకటవ వార్డ్ కౌన్సిలర్ దుబాసి వెంకటస్వామి జాతీయ జెండా ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్ర సాధాన కోసం పోరాడి ప్రాణ త్యాగం చేసిన అమరవీరులను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ రేగూరి జయపాల్ రెడ్డి, నాయకుడు బండారి సుగుణాకర్, ఒకటో వాడు అధ్యక్షుడు ఒంటేరు శరత్ బాబు, మంద నరేష్ బి అర్ ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## కోర్టు ఆవరణలో జెండా ఆవిష్కరించిన సాయి శరత్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి



జయభేరి, పరకాల, జూన్ 02:

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి శరత్ జాతీయ జెండా ను ఎగురావేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధానాకోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరులను గుర్తుచాసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి శరత్ తో పాటుగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూకట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పెద్దబోయిన వేణు,ఏ జి పి మెరుగు శ్రీనివాస్, ఏ పి పి, రుదిరా, న్యాయవాదులు రాజిరెడ్డి, చంద్రమౌళి, రాజమౌళి, వెంకటరమణ, శంకర్, స్వామి, పవన్, సురేష్, సాయి కుమార్,కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



జయభేరి, పరకాల, జూన్ 02:

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభ సందర్భంగా పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, అమరదామం యందు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతం, తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రసాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

## దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నసోదా రామకృష్ణ



జయభేరి, పరకాల, జూన్ 02:

నడికూడ గ్రామ మాజీ సర్పంచ్ నారగోని ఐలయ్య సతీమణి కీ.,శే., నారగోని సుగుణ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి దశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ ఈ కార్యకమం లో రామకృష్ణ తో పాటుగా సమన్వయ కమిటీ సభ్యులు పసుల రమేష్, బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, నల్లెల్ల అనిల్ కుమార్, ఏకు రాజు, గౌడ సంఘ కుల పెద్ద నారగోని రమేష్, బొచ్చు జెమిని తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ సందర్శించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్

■ స్టేషన్ ఫిర్యాదులు, రికార్డులు పరిశీలించిన కమిషనర్

జయభేరి, షాద్ నగర్, జూన్ 02 :



ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ సిపీ తరుణ్ జోషి షాద్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సందర్శించి పోలీస్ స్టేషన్ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ పలు అంశాలను పరిశీలించి శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల దర్యాప్తు, నివారణ చర్యలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై పోలీస్ స్టేషన్ పని తీరును సమీక్షించారు.స్టేషన్ రికార్డులు, పెండింగ్ దర్యాప్తులు, వినతుల పరిష్కారం, నేర గణాంకాలు, శాఖాపరమైన కార్యక్రమాల అమలును పరిశీలించారు.ప్రజలకు అనుకూలంగా, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వృత్తిపరమైన పోలీసింగ్‌ను అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల ఫిర్యాదులకు తక్షణ స్పందన ఇవ్వాలని, నేర కేసుల దర్యాప్తును నాణ్యంగా నిర్వహించాలని ఆదేశించారు.బీట్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం ద్వారా పోలీసుప్రజల మధ్య విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. గ్రామ పోలీసు అధికారులు గ్రామాలలో సమాచార సేకరణను చురుకుగా నిర్వహించి, అనుమానాస్పద కదలికలు మరియు కార్యకలాపాలను వెంటనే నివేదించాలని ఆదేశించారు.



గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలతో సన్నిహిత సమన్వయం కొనసాగించి, సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. రౌడీ షీటర్లు, అలవాటు నేరస్తులు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనే వ్యక్తులపై సమర్థవంతమైన పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ కార్యకలాపాలు, సైబర్ నేరాలు, జూదం, ఇతర నేరాల నియంత్రణకు మరింత కృషి చేయాలని సూచించారు. మహిళల భద్రత, బాలల సంరక్షణ, వృద్ధుల రక్షణ మరియు ప్రజల్లో అవగాహన కార్యక్రమాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. నేరాల గుర్తింపు మరియు దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ సాధనాలను వినియోగించాలని అధికారులకు సూచించారు.విధుల నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, వృత్తి నైపుణ్యం మరియు నైతిక విలువలను పాటించాలని ఆదేశించారు.శాంతి, సామరస్య వాతావరణం మరియు ప్రజా శాంతిభద్రతలను కాపాడేందుకు ముందస్తు పోలీసింగ్ మరియు నివారణ చర్యలపై దృష్టి సారించాలని సూచించారు.ప్రజలకు సమర్థవంతమైన, పౌర కేంద్రిత పోలీసింగ్ సేవలు అందించేందుకు అంకితభావంతో, నిబద్ధతతో, వృత్తిపరంగా పనిచేయాలని అన్ని హోదాల సిబ్బందికి పిలుపునిచ్చారు. పోలీస్ స్టేషన్ పనితీరుపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రజల భద్రత, రక్షణ మరియు పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ జోన్ డీసీపీ శిరీష రాఘవేంద్ర, షాద్‌నగర్ డివిజన్ ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ సీతారాం, ట్రాఫిక్ సీఐ శంకరయ్య, ఎస్సైలుసు శీల, శ్రీకాంత్ నాయక్, ప్రణయ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

జయభేరి, తుర్కపల్లి, జూన్ 02 :



తుర్కపల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రవికుమార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సోమల వెంకటేశం, పిఏసిఎస్ కార్యాలయం లో చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, మండల పశు వైద్యశాలలో డాక్టర్ రామచంద్రారెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రుచిరా రెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ, వెలుగు కార్యాలయంలో ఏపీఎం రమణ, రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారిని శ్రీ ఉమా, విద్యుత్ సబ్ స్టేషన్లో లో ఏ ఈ బిక్షపతి, పోలీస్ స్టేషన్లో ఎస్సై తకియోద్దీన్, కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, బిజెపి మండల పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్, టిఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయం వద్ద గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని సత్తయ్య, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, అన్ని గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సర్పంచులు, జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్ కల్పన, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు తుమ్మల మమతా తిరుపతిరెడ్డి, నాయకులు దేవరుప్పల ఐలయ్య, ధనావత్ రమేష్ నాయక్ పని గట్ల సుదర్శన్ గౌడ్, రామగొని వెంకటేష్ గౌడ్, వల్లపు రమేష్ ,బాలు యాదవ్, పట్టు నాయక్, పాముల రాజు గౌడ్, అరిగే మైపాల్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ భవన్‌లో ఆవిర్భావ వేడుకలు

■ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

జయభేరి, షాద్ నగర్, జూన్ 02 :



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా..తెలంగాణ భవన్‌లో అమరవీరులకు నివాళులర్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. అనంతరం జాతీయ జెండా ఎగురవేసి రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... ఎందరో మహనీయుల త్యాగాల ఫలితం వల్ల సాధించుకున్న తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వం అందరికీ ఎంతో మెయిల్ చేసిందని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు భారత రాష్ట్ర సమితి అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. అమరుల త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని వారి ఆత్మ శాంతి కలగాలని అమరవీరులకు ఘన నివాళులర్పించిన కేటీఆర్. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్రెడ్డి,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు మరియు మాజీ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ

జయభేరి, దేవరకొండ :




తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరకొండ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు నేనావత్ రాము నాయక్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఎన్నో త్యాగాలు, పోరాటాలు మరియు ఉద్యమాల ఫలితంగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు.

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు మొదటి నుండి మద్దతుగా నిలిచిందని, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుకు సంపూర్ణ సహకారం అందించిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి దేశంలో ఆదర్శ రాష్ట్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండాల అంజయ్య, మాజీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వినోద్ రాథోడ్ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి ఎర్ర బిక్షపతి, సీనియర్ నాయకులు రెడ్డి శంకర్ ,దేవరకొండ మండల కోశాధికారి కేలవత్ శంకర్, జయ ప్రకాష్, అంకురి గిరి కోర్ర లచ్చి రామ్, నేనావత్ రవి,బూత్ అధ్యక్షులు కాటామోని బన్నీ యాదవ్,వెంకట్, స్థానిక ప్రజలు పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు.



## దేవరకద్రలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని మున్సిపాలిటీలో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు పిపిఈ కిట్లను మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య రక్షణకు మున్సిపల్ యంత్రాంగం ఎల్లప్పుడు మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమైంది అని కొనియాడారు. నిరంతరం మురికి వ్యర్థాలతో పనిచేసే క్రమంలో కార్మికులు ఎలాంటి అనారోగ్యాల బారిన పడకుండా ఉండేందుకు ఈ పి పి ఈ కిట్లను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు మరియు పారిశుద్ధ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న కౌసర్ జహాన్



జయభేరి, దేవరకద్ర :

పాలమూరు జిల్లా ఎన్టీఆర్ కళాశాల ప్రిన్సిపల్ కౌసర్ జహాన్ మంగళవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డును అందుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కౌసర్ జహాన్ కు ఈ ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు అందజేశారు. దీంతో ప్రిన్సిపల్ కౌసర్జహాన్ ను పలువురు అభినందించారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



జయభేరి, దేవరకొండ :

విలేజ్ డెవలప్ మెంట్ సొసైటీ లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జరుపు కొన్నారు జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ లావుడి బాషా చౌహాన్ NGO జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లావుడి బాషా చౌహాన్ మాట్లాడుతూ 12.వసంతవంలో అడుగూ పెడుతున్నాం అందరికి మంచి జరగాలని ఆ భగవంతుడి కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో టైలర్ శాంతి ,బ్యూటీషన్ కవిత, కంప్యూటర్నిహారిక శిక్షణ పొందుచున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి పాలమూరు సమస్య

- బహిరంగ లేఖ విడుదల చేసిన జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ

**జయభేరి, షాద్ నగర్, జూన్ 02 :**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 4న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన సందర్భంగా "ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు బహిరంగ లేఖను మీడియాకు విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధిలో మాత్రం వెనుకబడిందని లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా కృష్ణా జలాల్లో జిల్లాకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, షాద్‌నగర్ ప్రాంతంలో ప్రతిపాదిత పరిశ్రమలు మరియు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాలమూరు జిల్లాలో వలసల సమస్య ఇప్పటికీ పూర్తిగా నివారణ కాలేదని, తాగునీరు, సాగునీరు, ఉపాధి, రహదారులు, పరిశ్రమలు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని లేఖలో పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి ప్రాంతీయ అసమానతలను తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం కూడా పాలమూరు ప్రాంత ప్రజల ఆకాంక్షలు పూర్తిగా నెరవేరలేదని, ముఖ్యమంత్రి జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ప్రకటించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల ప్రతినిధులు, ఉద్యమ నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని బహిరంగ లేఖకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజీ శ్రీనివాస్, రవీంద్రనాథ్, మందారం నరసింహులు, రామారావు, నరసన్న, కృష్ణయ్య, నరసింహులు గౌడ్, తిరుమలయ్య, కృష్ణ, సత్యం, మేకల వెంకటేష్, ముదిరాజ్, రవికుమార్, పద్మారం వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ కార్మికులకి ముఖ హాజరై పద్ధతిని రద్దు చేయాలి

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కే లోకనాథం డిమాండ్

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండల కేంద్రమైన పరవాడ లో ఉపాధి హామీ కార్మికుల ముఖ హాజరు పద్ధతి రద్దు చేయాలని పాత పద్ధతుల్లోని ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని మంగళవారం ఉపాధి హామీ కార్మికులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే లోకనాథం మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నారని అన్నారు. ఉపాధి హామీ కార్మికులకు పేస్ యాప్ ద్వారా అనేకమందికి హాజరు పడక సార్వార్లు పనిచేయక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. 200 రోజులు పని దినాలు ఏర్పాటు చేయాలని అన్నారు. రోజుకి 600 రూపాయలు చెల్లించాలన్నారు. ఉపాధి హామీ కార్మికులకు సమ్మర్ అలవాన్స్ 40 శాతం కలిపి ఇవ్వాలన్నారు. తట్టకి పారకి గొడపాకి డబ్బులు చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో సౌకర్యాలతో పాటు మెడికల్ కిట్లు మజ్జిగ ప్యాకెట్లు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ, ఉపాధి హామీ కార్మిక సంఘ నాయకులు నాయుడు, అప్పారావు, శంకర్రావు, పార్వతి, రమణమ్మ, అప్పల నరసింహ, లక్ష్మి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు



## నూతన డీఈఓ కు స్వాగతం పలికిన టీఎస్ యుటిఎఫ్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా నూతన డీఈఓ గా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఐ. విజయ్ కుమార్ ని మంగళవారం టిఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించింది. ఇటీవల జిల్లా నూతన డీఈఓ గా విజయ కుమారి పదవి బాధ్యతలు చేపట్టారు. దీంతో టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు డీఈఓ ని కలిసి ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో పాలమూరును ప్రథమ స్థానంలో నిలబెట్టడానికి ఉపాధ్యాయులందరూ తనకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. విద్యాభివృద్ధి విషయంలో తెలంగాణ రాష్ట్రంలోనే పాలమూరు జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామన్నారు. ఉపాధ్యాయులందరూ బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. విధుల పట్ల అందరు జవాబు దారితనం చూపాలని కోరారు. నూతన డీఈఓ ను స్వాగతం పలికిన వారిలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేష్, దేవరకద్ర మండల అధ్యక్షుడు కే శంకర్, జిల్లా కార్యదర్శి అజయ్ తదితర ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం పెద్దరాజమూర్ ఎం పి యు పి ఎస్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 12వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు కవిత జాతీయ జెండా పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శంకర్, వెంకటేశ్వర్లు, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యాభిమానులు, యువకులు, వివిధ యువజన సంఘాల సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ దేవరకొండ ఖాతాదారుల సమావేశం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారుల సమావేశం బ్యాంక్ ప్రాంగణంలో బ్యాంకు చైర్మన్ తడక రమేష్ అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్ భారత రాజేంద్రప్రసాద్, సీఈఓ సీత శ్రీనివాస్ బ్యాంక్ మేనేజర్ కేతావత్ పార్ధునాయక్, అసిస్టెంట్ మేనేజర్ భాగ్యశ్రీ , బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాలుగొన్నారు. ఈ సందర్భంగా ఖాదారులు అంకం చంద్రమౌళి మాట్లాడుతూ దేవరకొండ బ్రాంచ్ వారు ఖాతాదారులకు ఉత్తమమైన సేవలు అందిస్తున్నారు, వారి సేవలను మేము మరువలేము అన్నారు. అనంతరం, చైర్మన్ తడక రమేష్ మాట్లాడుతూ దేవరకొండ బ్రాంచి 2012లో ప్రారంభించిన్నాము నేడు ఈ బ్రాంచ్ టర్నోవర్ 22 బ్రాంచిల లో 3వ స్థానంలో వుంది. అంతా ఖాతాదారుల నమ్మకం, మా సిబ్బంది సేవలు అని అన్నారు, బ్యాంక్ మేనేజర్ పార్ధునాయక్ బ్యాంకు పెద్దలకు హాజరైన ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలియజేసినారు.

# బస్సు సౌకర్యంపై ఎమ్మెల్యే పంచకర్ల హామీ

**జయభేరి, పరవాడ:**




ముత్యాలమ్మ తల్లి పండుగ సందర్భంగా పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును నాయుడుపాలెం పంచాయితీకి చెందిన టీడీపీ నాయకుడు కూంద్రపు మధు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. ముత్యాలంపాలెం నుండి అనకాపల్లి మధ్య ప్రయాణికుల ఇబ్బందులను తొలగించేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కూంద్రపు మధు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ, బస్సు ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అయితే, ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉంటే రెండు వారాల తర్వాత బస్సు రద్దయ్యే ప్రమాదం ఉందని, కాబట్టి ప్రజలందరూ ఈ ప్రభుత్వ రవాణా సౌకర్యాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. మెట్టపాలెం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఉన్న గ్రావెల్‌ను తొలగించి, ఆటస్థలాన్ని చదును చేయడం ద్వారా విద్యార్థులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యేకు వివరించారు. అదే సమయంలో, అక్కడ సేకరించిన గ్రావెల్‌ను ముత్యాలమ్మ తల్లి గుడి ప్రాంగణంలో వేసి ఎత్తు పెంచేందుకు ఉపయోగించుకోవచ్చని ప్రతిపాదించారు. ఈ రెండు పనులకు కూడా ఎమ్మెల్యే రమేష్ బాబు పూర్తి సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి తక్షణమే సానుకూల నిర్ణయాలు తీసుకున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు కూంద్రపు మధు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులు త్వరలోనే కార్యరూపం దాల్చుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# బాబు వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్ ఆవిష్కరణ

- ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న వైస్సార్సీపీ రాష్ట్ర,జిల్లా ముఖ్య నాయకులు

**జయభేరి, పరవాడ:**




అనకాపల్లి జిల్లా అనకాపల్లి పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రివర్యులు పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు కూటమి ప్రభుత్వం రెండేళ్లు పరిపాలనకు వ్యతిరేకంగా చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ అనే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు రీజనల్ కోఆర్డినేటర్ మాడుగుల నియోజకవర్గం సమన్వయకర్త బూడి ముత్యాలునాయుడు, మాజీ మంత్రి రీజనల్ కోఆర్డినేటర్, చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్, మాజీ ప్రభుత్వ విప్ యలమంచిలి నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ,వైఎస్ఆర్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు,పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గం పరిశీలకుడు పైలా శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో ఏడు నియోజకవర్గాల పరిశీలకులు, మండలం పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు జడ్పిటిసిలు, ఎంపిటీసీలు, వార్డు అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు,రాష్ట వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు,కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.


# పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కొండమల్లేపల్లి శాఖ రెండవ వార్షికోత్సవం

**జయభేరి, కొండమల్లేపల్లి :**




పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కొండమల్లేపల్లి శాఖ రెండవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఖాతాదారుల సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్యాంకు చైర్మన్ తడక రమేష్ బ్యాంకు CEO సీత శ్రీనివాస్ బ్యాంకు వైస్ చైర్మన్ శ్రీ భారత రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు బ్యాంకు చైర్మన్ తడక రమేష్ మాట్లాడుతూ బ్యాంకులో ఉన్న వివిధ సేవలైన పెన్షన్ అకౌంట్లు, సేవింగ్స్ ఖాతాలు, గోల్డ్ లోన్లు, ATM కార్డులు, NEFT/RTGS సౌకర్యాలు, చెక్‌బుక్, UPI సేవలు, మొబైల్ బ్యాంకింగ్, PMJJBY, PMSBY, GJPA ఇన్సూరెన్స్ పథకాల గురించి వివరించారు. అలాగే ఖాతాదారులు ఫిక్సడ్ డిపాజిట్ మరియు రుణ సదుపాయాలను వినియోగించుకొవాలి అని కోరడం జరిగింది. రైతులు, వ్యాపారులు ఇతర వర్గాల ప్రజలకు బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. ప్రస్తుతం 22 శాఖలలో ₹610 కోట్లకు పైగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నామని, అందులో మన కొండమల్లేపల్లి శాఖ ముందంజ లో ఉంది అని తెలిపారు అదేవిధంగా మరింత ఫిక్సడ్ డిపాజిట్ లను మల్లేపల్లి గ్రామ ప్రజలు వినియెగించుకోవాలని కోరినారు . రెండవ వార్షికోత్సవ సందర్భంగా ఖాతాదారులకు బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇట్టి ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ శ్రీ సీత శ్రీనివాస్ బ్రాంచ్ మేనేజర్ సతీష్ పులిజాల, ఆఫీసర్ పోలేపల్లి కోటయ్య, డింపుల్ సింగ్ రమావత్ సంతోష్, షైక్ రహీమా, సామలటి రమేష్ కోట సత్యనారాయణ ఖాతాదారులు పంపాటి శ్రీధర్, బండారు శ్రీకాంత్, కేసాని లింగ రెడ్డి, మిర్యాల యాదయ్య, ఊటుకూరి శ్రీనివాస్ రెడ్డి, కామిశెట్టి హరీష్, వాసికర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ తల్లి అమ్మవారిని దర్శనించుకొన్న ఎమ్మెల్యే పంచకర్ల



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం, ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయతీలో ముత్యాలమ్మ తల్లి పండగ మహోత్సవ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షుడు & పెందుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముత్యాలమ్మ తల్లి అమ్మవారిని దర్శనం చేసుకున్నరు వీరిని జనసేన పార్టీ నాయకుడు అర్జిల్లి అప్పలరాజు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ అమ్మవారి యొక్క ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని , సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ, శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా కుటుంబ సభ్యులతో పండగను అంగరంగ వైభవంగా సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పయిల జగన్నాధరావు, టీడీపి నాయకుడు కన్నూరు వెంకటరమణ, ఎక్స ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు, సీనియర్ జన సైనికులు సమ్మంగి అప్పారావు, బొంది దుర్గారావు, చింతకాయల ముత్యాలు, చింతకాయల శ్రీను ,అర్జిల్లి అప్పలరాజు ,చింతకాయల అప్పన్న సూరాడ మహేష్ సూరాడ అమ్మోరయ్య, తిత్తి శివాజీ, పరవాడ మండలం కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ తల్లి సన్నిధిలో మాడుగుల ఎమ్మెల్యే బండారు



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత ముత్యాలమ్మ తల్లి పండగ మహోత్సవం మంగళవారం అత్యంత వేడుకగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి,మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, యువనేత బండారు అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా విచ్చేసి ముత్యాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతరకు విచ్చేసిన ముఖ్య అతిథులకు స్థానిక తెదేపా నాయకులు మరియు ఉత్సవ కమిటీ పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాడుగుల ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ముత్యాలమ్మ తల్లి చల్లని నీడలో బ్రతుకుతున్న గంగపుత్రుల జీవితాలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ, ఇటువంటి గ్రామదేవతల పండుగలు గ్రామంలో సంస్కృతి సంప్రదాయాలకు అర్థం పడుతూ ఐక్యత భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మాజీ సర్పంచులు చింతకాయల ముత్యాలు,చింతకాయల సుజాత,ఎంపీటీసీ అర్జిల్లి దేవి రవి,మాజీ ఎంపీటీసీ కూంద్రపు శ్రీరామ్మూర్తి,లోకి రెడ్డి సన్యాసినాయుడు(అభి), చింతకాయల రవి,ఎల్లాజీ తదితర తెదేపా ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

## కేసిఆర్ లేనిదే తెలంగాణనే లేదు

**జయభేరి, మల్కాజిగిరి :**

మల్కాజిగిరి నియోజకవర్గం లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో మల్కాజిగిరి జోనల్ కమీషనర్ సంచిత్ గంగ్వార్ జాతీయ జండాని ఆవిష్కరించారు, మల్కాజిగిరి క్రోస్ రాడ్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు జాతీయ జండా ఆవిష్కరించారు, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి ఎమ్మెల్యే విచ్చేసారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రేడిసి మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సాధనలో కేసిఆర్ పాత్ర స్మరించుకోవాల్సిన అవసరం ఉంది, కేసిఆర్ లేనిదే తెలంగాణనే లేదు అని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాకముందు నీటి, కరెంట్ కష్టాలు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉందో ప్రజలందరూ గమనించాల్సిన అవసరం ఉందని తెలిపారు , ఎవరు ఎన్ని అనుకున్నా తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్రను చేరిపేయలేరని తెలిపారు.

# కొరియా టూరిజం రాయబారిగా ప్రియాంక




'ఓజీ' బ్యూటీ ప్రియాంక మోహన్‌కి అరుదైన అంతర్జాతీయ గౌరవం దక్కింది. కొరియా టూరిజం ఆర్గనైజేషన్ ఆమెను 'కొరియా టూరిజం గౌరవ రాయబారి'గా నియమించింది. ఇటీవలే ఆమె 'మేడిన్ కొరియా' అనే ఓటీటీ సినిమాలో నటించిన విషయం తెలిసిందే. ఇందులో కొరియా వెళ్లడం జీవితాశయంగా పెట్టుకున్న తమిళ అమ్మాయిగా ప్రియాంక మోహన్ నటించింది. ఓటీటీలో విడుదలైన ఈ చిత్రానికి విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఈ నేపథ్యంలో కొరియన్ గవర్నమెంట్ ఆమెకు ఈ గౌరవాన్ని అందించడం విశేషం. కొరియన్ సంస్కృతి, పర్యాటక రంగంపై భారతీయ యువతలో అవగాహన పెంచేందుకుగాను ఆమెను ఈ పదవికి ఎంపిక చేశారు. ఈ బాధ్యతాను గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ప్రియాంక మోహన్ ఆనందం వ్యక్తం చేసింది.




# ప్రేమలో నువ్వే కదా..


స్వీయ నిర్మాణంలో వద్దే నవీన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్‌తేజ నార్ల దర్శకత్వం వహిస్తున్నారు. రాశిసింగ్ కథానాయిక. ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం 'నువ్వే కదా..' అనే పాటను విడుదల చేశారు. కల్యాణ్‌నాయక్ స్వరపరచిన ఈ పాటను భాస్కరభట్ల రచించారు. రోహిత్, హరిణి ఆలపించారు. నాయకానాయికల మధ్య ప్రేమానురాగాల్ని ఆవిష్కరించే గీతమిదని, చక్కటి సాహిత్యంతో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. సుదీర్ఘ విరామం తర్వాత వద్దే నవీన్ నటిస్తున్న ఈ చిత్రాన్ని విభిన్న కథాంశంతో తెరకెక్కిస్తున్నామని, ఆయన పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: కల్యాణ్ నాయక్, నిర్మాత: వద్దే నవీన్, దర్శకత్వం: కమల్‌తేజ నార్ల.

# ధిక్కారమే నా నైజం



హీరో రామ్ పోతినేని నటిస్తున్న 23వ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ సినిమా ద్వారా ఆయన తొలిసారి మెగాఫోన్ పట్టబోతున్నారు. స్వీయ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణం నుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. సైకలాజికల్ థ్రిల్లర్ కథాంశమిది. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వూల్ఫ్' అంటూ ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్‌కు మంచి స్పందన లభించింది. ఈ నేపథ్యంలో ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాల్ని పంచుకున్నారు రామ్ పోతినేని. 20ఏళ్ల సినీ ప్రయాణంలో నటుడిగా, వ్యక్తిగా ఎంతో పరిణతి సాధించానని, ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొన్నా ఏనాడు భయపడలేదని అన్నారు. '18ఏళ్ల వయసులో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టా. జయాపజయాల నుంచి ఎన్నో పాఠాల్ని నేర్చుకున్నా. పరిస్థితులు మనల్ని ఎప్పుడూ భయపెట్టడానికి ప్రయత్నిస్తుంటాయి. కానీ రెబల్‌గా ఉండటమే నా నైజం. నా రూల్స్ ప్రకారం జీవితాన్ని సాగిస్తున్నా. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్నదే నా ఫిలాసఫీ' అని చెప్పారు రామ్ పోతినేని. 'రాపో' సినిమాటిక్స్ పతాకంపై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# డైపర్లు మార్చడం మాత్రం నా వల్ల కాదు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం తన ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది' విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం చిత్ర బృందం జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో రామ్ చరణ్ సినిమా విశేషాలతో పాటు తన వ్యక్తిగత జీవితం, కుటుంబం, తండ్రిగా తన అనుభవాల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రామ్ చరణ్, ఉపాసన దంపతులకు ప్రస్తుతం ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె క్లిన్ కారాతో పాటు ఇటీవల జన్మించిన కవలలు కుటుంబానికి మరింత ఆనందాన్ని తెచ్చారు. పిల్లల పెంపకంలో తన పాత్ర గురించి మాట్లాడిన చరణ్, తాను సాధ్యమైనంత ఎక్కువ సమయం పిల్లలతో గడపడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. నేను మంచి తండ్రినా కాదా అనేది నాకు తెలియదు. కానీ పిల్లల పెంపకంలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటాను.

వాళ్లకు భోజనం పెట్టడం, నిద్రపుచ్చడం, ఆడించడం లాంటి పనులన్నీ చేస్తాను. క్లిన్ కారా చాలా సందర్భాల్లో నాతోనే నిద్రపోతుంది. అయితే డైపర్ మార్చాల్సిన సమయం వస్తే మాత్రం మెల్లగా అక్కడి నుంచి తప్పించుకుంటాను అంటూ నవ్వుతూ చెప్పిన చరణ్ వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. తన భార్య ఉపాసన గురించి మాట్లాడిన రామ్ చరణ్, కుటుంబంలో నిర్ణయాలు తీసుకునే విషయంలో ఆమెకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని సరదాగా తెలిపారు. పెళ్లైన తర్వాత ప్రతి భర్త నేర్చుకునే విషయం ఒకటే... ఇంట్లో భార్యే బాస్. మా ఇంట్లో కూడా ఉపాసనే బాస్. సినిమా జీవితంలో షెడ్యూల్స్ ఎప్పుడూ మారుతూ ఉంటాయి. ఎప్పుడు ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితులు ఉంటాయి. అలాంటి సమయంలో కుటుంబాన్ని బ్యాలెన్స్ చేయడానికి చాలా అవగాహన, అడ్జస్ట్‌మెంట్ అవసరం. ఆ విషయంలో ఉపాసన నాకు ఎప్పుడూ అండగా నిలుస్తుంది అని చరణ్ వెల్లడించారు. కాగా, రామ్ చరణ్, ఉపాసనల అనుబంధం చాలా ప్రత్యేకమైనది. స్కూల్ రోజుల నుంచే ఒకరికొకరు పరిచయం ఉన్న వీరిద్దరూ, తర్వాత కొంతకాలం దూరమైనా మళ్లీ కలుసుకుని స్నేహాన్ని ప్రేమగా మార్చుకున్నారు. 2012లో వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంట, ఇప్పుడు ముగ్గురు పిల్లల తల్లిదండ్రులుగా ఆనందకరమైన జీవితాన్ని గడుపుతున్నారు.



# కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్..

టాలీవుడ్ లో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందాలతో ప్రేక్షకులను కవ్వించారు అలాంటి వారిలో హంసానందిని ఒకరు. అందాల భామ హంసా నందిని పూనేలో పుట్టి, పెరిగింది. మోడలింగ్ చేయడంకోసం ముంబైకి వచ్చింది ఈ అమ్మడు. 2002 నుంచి మోడలింగ్ రంగంలో ఉంటూ, పలు టెలివిజన్ ప్రకటనలలో నటించింది. ఆతర్వాత హీరోయిన్ గా మారింది. 2004లో వచ్చిన ఒకటవుదాం సినిమాతో హీరోయిన్ గా మారింది హంసానందిని. హీరోయిన్ గా వరుసగా సినిమాలు చేసింది ఈ ముద్దుగుమ్మ. హీరోయిన్ గా అంతగా సక్సెస్ కాలేదు ఈ చిన్నది. దాంతో కొన్ని సినిమాల్లో సెకండ్ హీరోయిన్ గా చేసింది. అయినా కూడా అనుకున్నంతగా గుర్తింపు తెచ్చుకోలేదు. దాంతో స్పెషల్ సాంగ్స్ చేసి మెప్పించింది. 2013 లో మిర్చి, భాయి, అత్తారింటికి దారేది, రామయ్యా వస్తావయ్యా, బాలకృష్ణ హీరోగా నటించిన లెజెండ్ సినిమాలలో ప్రత్యేక గీతాలలో నటించింది. ఇదిలా ఉంటే 2021 లో తాను రొమ్ము క్యాన్సర్ వ్యాధి బారిన పడ్డట్లు తెలిపింది. తన తల్లి కూడా క్యాన్సర్ తోనే మరణించింది. జన్యుపరంగా తాను క్యాన్సర్ వ్యాధి బారిన పడ్డట్లు తెలిపింది. క్యాన్సర్ ని జయించిన హంసా నందిని ఇప్పుడు అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ హాట్ హాట్ ఫొటోలతో కవ్విస్తుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**